క్లుప్తంగా

పైనాపిల్ వ్యాన్ బోల్తా



రోడ్డుపై పడిన పైనాపిల్ వ్యాన్

సీతంపేట: కొండ శిఖర మారుమూల గ్రామమైన మీనకోట నుంచి విశాఖపట్నానికి పైనాపిల్ విక్రయించడానికి తీసుకువెళ్తుండగా జంపరకోట సమీపంలో వ్యాన్ బోల్తా పడింది. వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పైనాపిల్ విక్రయానికి తీసుకువెళ్తుండగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రుక్మిణిగూడ ఘాట్‌రోడ్‌లో కూడా ఒక వ్యాన్ బోల్తాపడిన విషయం విదితమే.

25 మొబైల్ ఫోన్ల అప్పగింత



ఫోన్లను అప్పగిస్తున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ పరిధిలోని కొన్ని రోజులుగా పోయిన ఫోన్లను సీఐ కృష్ణారావు బాధితులకు గురువారం అప్పగించారు. టెక్నికల్ సిబ్బంది సాయంతో మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి అప్పగించమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఫోన్లు దొంగతనానికి గురి కాలేదని కొన్ని ప్రాంతాల్లో మర్చిపోయినవని తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



లక్ష్మీనృసింహ స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వేంచేసి దశాబ్దాలుగా పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గల లక్ష్మీనృసింహ స్వామివారిని గురువారం ఉదయంనుంచి వందలాది మంది భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాలనుంచి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

క్రైస్తవ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న క్రైస్తవ సోదరులు

పార్వతీపురంటౌన్: భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా మన్యం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా ఫెలోషిప్ పెద్దలు బిషప్ తిమెతి తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలంలోని టేకులోవ గిరిజన ప్రాంతంలో పేదలకు రేషన్ పంపిణీ జరిగింది. యేసుక్రీస్తు శిష్యులలో ఒకరైన సెయింట్ థామస్ మరణ దినాన్ని భారతీయ క్రైస్తవ దినంగా భక్తులు పాటిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఫెలోషిప్ పెద్దలు బిషప్ తిమెతి, పాస్టర్స్ సూర్యప్రకాశ్, విజయ కుమార్, సుధీర్ చంద్ర, గోపి పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

మక్కువ: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఈనెల 6న మక్కువ, శంబర పశువైద్యశాలల వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి కె.పాలందొర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జునోసిస్ వ్యాధులు సంక్రమించేవి కావడంతో పెంపుడు జంతువులకు యజమానులు వ్యాక్సిన్ వేయించాలని కోరారు.

ఘనంగా అల్లూరి జయంతి



సీతానగరం: విప్లవవీరుడికి నివాళులర్పిస్తున్న మండపరిషత్ ప్రజాప్రతినిదులు, అధికారులు.

సీతానగరం:

విప్లవవీరుడు, భరతజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాంయలో తహసీల్దార్ శ్రీనివాసరావు డీటీలు, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బి.రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు శ్రీరాములునాయుడు, ఏఓ ప్రసాద్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ దాలినాయుడు అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.



బలిజిపేట: పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసిన సుబ్బారావు, గ్రామస్తులు



మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళలు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మంజులావీణ, అధ్యాపకులు



సీతానగరం: తహసీల్దార్ కార్యాలయంలో మన్యం వీరుడు సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు అధికార సిబ్బంది



సీతానగరం: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్‌దాలియుడు, ఎన్ఎస్ఎస్ పీఓలు

పోరాట యోధుడు అల్లూరి

బలిజిపేట: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని బలిజిపేట సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప పోరాటయోధుడు, దేశభక్తి కలిగిన గొప్ప వ్యక్తి అల్లూరి సీతారామరాజని కొనియాడారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవినాయుడు, జి.శ్రావణ్, కె.గౌరీనాథ్ చైతన్య, పి.పరశురామ్, పి.భాస్కర్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.రుక్మాంగదయ్య



పార్వతీపురం టౌన్: అల్లూరి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ



పార్వతీపురం టౌన్: అల్లూరి చిత్ర పటానికి నివాలులర్పిస్తున్న సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ



సాలూరు: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

గంగాడ సర్పంచ్‌గా వడ్డాది లక్ష్మి



నూతన సర్పంచ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- నియామక ఉత్తర్వులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: బలిజిపేట మండలంలోని గంగాడ గ్రామ నూతన సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ వైస్‌సర్పంచ్ వడ్డాది లక్ష్మి ఎన్నికైనట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో గ్రామ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నూతనంగా నియామకం అయిన సర్పంచ్ లక్ష్మి, భర్త అచ్యుతరావులకు ఆ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ దివంగత గంట లతా మంగేష్కర్ ఇటీవల అనారోగ్య కారణంగా అకాల మరణం చెందగా ఖాళీ అయిన సర్పంచ్ స్థానంలో అదే గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ వడ్డాది లక్ష్మిని సర్పంచ్‌గా నియామకం చేస్తూ పంచాయతీ శాఖ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సర్పంచ్‌ను ఆశీర్వదిస్తూ గ్రామ నాయకులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ అందరూ కలిసికట్టుగా నడుస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు సూచించారు. మీకు అండగా ఉంటానని గ్రామ నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంట సూర్యనారాయణ, బొమ్మి నారాయణరావు, గంట వెంకటనాయుడు, ఎంపీటీసీ శంకరరావు, మాజీ ఎంపీటీసీ సబంగి జగన్, నాయకులు ఏగిరెడ్డి శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీకి నివారణే మార్గం

బలిజిపేట: డెంగీ వ్యాధికి నివారణే మార్గమని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధురి తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అతిసార వ్యాధి కలిగిన వారిని గుర్తించి వారికి అవసరమైన మందులను అందిస్తారని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉంటే 14రోజుల పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను వినియోగిస్తే వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కర్ణ, వైద్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నూకలవాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

ప్రశాంతంగా విద్యాసంస్థల బంద్



మక్కువ: జెడ్పీహెచ్ఎస్‌లో బంద్‌కు పిలుపు నిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు హరికృష్ణ



మక్కువ: పాఠశాలనుంచి ఇంటిదారి పడుతున్న విద్యార్థులు

మక్కువ: నీట్, యూజీసీనెట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. పాఠశాలలు, కళాశాలలకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వెళ్లి, బంద్‌కు సహకరించాలని కోరగా, విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులను బహిష్కరించారు. మక్కువ మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

జ్వర లక్షణాలుంటే నిర్ధారణ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి

పార్వతీపురంటౌన్: జ్వర లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ సత్వరమే నిర్ధారణ పరీక్షలు జరపాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయపార్వతి స్పష్టం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లతో గురువారం ఆమె ఎన్జీఓ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావున ఆస్పత్రులకు జ్వర లక్షణాలతో వచ్చే వారికి కాలయాపన లేకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే సత్వరమే వైద్యాధికారి, వైద్యుల దృష్టికి తీసుకువచ్చి తగు చికిత్స అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరీక్షా కిట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

మలేరియా నిర్ధారణ స్పష్టంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ మైక్రోస్కోపిక్ పరీక్ష ద్వారా మలేరియా నిర్ధారణ స్పష్టంగా ఉండాలన్నారు. మలేరియా, డెంగీ నిర్ధారణ వివరాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని కోరారు. ల్యాబ్ నిర్వహణపై మరింత నైపుణ్యం చేకూర్చేందుకు సెంట్రల్ మెడికల్ ల్యాబ్ నుంచి బి.కల్యాణి జిల్లాకు విచ్చేసి సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్లకు మైక్రోస్కోపిక్ పరీక్షా విధానంపై పునశ్చరణ శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, ఎన్జీఓ అధ్యక్షుడు కిశోర్, మలేరియా కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు నివారణకు జాగ్రత్తలు పాటించాలి



డెంగీ వ్యతిరేక సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ఓ ఎస్‌వీ రమణ

సీతానగరం: డెంగీ, అతిసార, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో సేవలందించాలని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్‌వీ రమణ అన్నారు. ఈ మేరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆర్.వెంకంపేటలో మండల వైద్యాధికారి డాక్టర్ బి.పావని పర్యవేక్షణలో బుడ్డిపేట, ఆర్ వెంకంపేట గ్రామాల్లో ర్యాలీలు, ఉచితవైద్య శిబిరాలు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆర్.వెంకంపేటలో సీహెచ్ఓ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలడానికి మూలాలను గుర్తించేవిధంగా ప్రజలు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో హెచ్ఏలు కె.నారాయణరావు, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఎన్ఎంలు స్వర్ణ, సింహాచలం, అంగన్వాడీ టీచర్ బి. సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలి రోజు 138 మందికి ఈసెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: తొలిరోజు 138 మందికి ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎమ్మార్‌నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ విలియమ్ కేరీ తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో గురువారం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఈ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 10వరకు ఉంటుందన్నారు. 8 నుంచి 12 వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించామని, 13న ఆప్షన్లలో మార్పులు, 16న ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

నేడు సామాజిక ప్రజా వేదిక

వంగర: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల స్థాయి సామాజిక ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ మర్రాపు సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజులుగా ఎనిమిది మంది డీఆర్‌పీల బృందం గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ రకాల పనులపై గ్రామస్థాయిలో ఆడిట్ చేసి గ్రామ సభలు నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజావేదికకు ఉన్నతాధికారులు హాజరవుతారని, ఉపాధిహామీ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

10న కార్మిక నిరసన



విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై నాయుడు

మక్కువ: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికవర్గం డిమాండ్లు నేరవేర్చాలని ఈనెల 10వతేదీన నిరసన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఎస్.వై నాయుడు తెలిపారు. ఈ మేరకు మండలకేంద్రం మక్కువ లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక వర్గాలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో కమిటీ చేసిన సిఫార్సులు అమలుచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికవర్గానికి సగం వేతనం పింఛన్ రూపంలో అందించాలని, రాష్ట్రంలో రికవరీచేసిన, వీర్ఏల డీఏను, తిరిగి జీతంతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎం.కృష్ణ, పవన్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



ఆర్బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల ఆర్బీకే, గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో వైద్యులందరూ అప్రమత్తంగా ఉండాలని సీతానగరం సబ్‌డివిజన్ పశుసంవర్ధ కశాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వెంకటాపురం ఆర్బీకేలో రికార్డులు, టీపీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇప్పటికే గ్రామాల్లో పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా వ్యాధి నిరోధక టీకాలు, జబ్బువాపు, గొంతువాపు వ్యాధి నివార ణకు వ్యాక్సిన్లు వేసినట్లు తెలిపారు. అలాగే గొర్రెలు, మేకల్లో వచ్చే పారుదు వ్యాధి నివారణకు మందులు వేశామన్నారు. గ్రామాల్లో పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలియ జేశారు.అన్ని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేస్తామని పశువైద్యులందరూ గ్రామాల్లోపశువైద్య కేంద్రాలను నిర్వహించాలని కోరారు. అన్ని ఆర్బీకేల్లో మందులు ఉన్నాయని తెలియజేశారు.

ఆయుష్ మందులతో గ్యాస్ట్రిక్ మటుమాయం



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ తెల్లి హేమాక్షి

సీతానగరం: ఆయుష్ మందులతోనే దీర్ఘకాలిక వ్యాధులు మటుమాయం అవుతాయని ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు మండలంలోని చెల్లన్నాయుడువలస గ్రామంలో సర్పంచ్ వి.అప్పమ్మ ఆధ్వర్యంలో బూర్జప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రి డాక్టర్ టి.హేమాక్షి గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యానికి గురై దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆయుర్వేద మందులతో ఉపశమనం కలుగుతుందని భరోసా ఇచ్చారు. రోగనిర్ధారణ చేసి అనంతరం వ్యాధి తగ్గుముఖం పట్టినంతవరకూ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్య సేవలు అందించనున్నామన్నారు. ఎముకలకు సంబంధించి, గ్యాస్ట్రిక్‌తో ఇబ్బందులు పడుతున్న వారికి యోగాసనాల ద్వారా నయం చేసేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆయుష్ ఉచితవైద్యశిబిరాలను ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.

గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 60 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, మాజీ సర్పంచ్ వి.పారినాయుడు పాల్గొన్నారు.